• ఫటాఫట్

ఆరు నెలలు రేషన్ తీసుకోకుంటే కార్డు తొలగింపు

విజేందర్, డిప్యూటీ తహసీల్దార్



ఆంధ్రజ్యోతి: పెద్దపల్లి మండలంలో ఎన్ని రేషన్‌దుకాణాలు ఉన్నాయి? కార్డు దారులు ఎందరు?

డిప్యూటీ తహసీల్దార్: మండలంలోని గ్రామాలలో 33, పట్టణ ప్రాంతంలో 24 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 29వేల300 మంది లబ్ధిదారులున్నారు.

ఆంధ్రజ్యోతి: రేషన్ దుకాణాలకు సన్న బియ్యం చేరుకున్నాయా ?

డీటీ: అన్ని దుకాణాలకు సన్న బియ్యం చేరుకున్నాయి. అందులో మండల వ్యాప్తంగా 5476.06 క్వింటాళ్ల బియ్యం అవసరం.

ఆంధ్రజ్యోతి: ఎన్ని నెలలు రేషన్ సరుకులు తీసుకోకపోతే కార్డులు తొలగిస్తారు?

డీటీ: రేషన్‌కార్డు దారులు 6 నెలల పాటు సరుకులు తీసుకోకపోతే కార్డు తొలగిస్తాం. రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా సరుకులు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: సన్నబియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా ?

డీటీ: సన్న బియ్యం పంపిణీ ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహిస్తున్నాం. ప్రతీ నెల సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారు లు తనిఖీలు చేపడుతున్నాం.

- పెద్దపల్లి రూరల్

మహిళలకు పెద్దపీట

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం కేటాయించేందుకు కసరత్తు
- ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, రైస్‌మిల్లుల ఏర్పాటు
- మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముందుకు



పెద్దపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది. ఆర్టీసీ బస్సుల కొనుగోళ్లతోపాటు పెట్రోల్ బంక్‌ల నిర్వహణ, రైస్‌మిల్లులను ఏర్పాటు చేయాలని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం ఈ సీజన్ నుంచే మహిళలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంచాయతీ రాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు సెర్ప్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 269 కేంద్రాలు సహకార సంఘాలు, 59 మహిళా సంఘాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసే సంఘాలతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నిర్వహణలో ఉన్న కొన్ని కేంద్రాలను మహిళా సంఘాలకు ఇచ్చే విధంగా సెర్ప్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసినందుకు క్వింటాలు ధాన్యానికి కామన్ రకం 3120 రూపాయలు, ఫైన్ రకం ధాన్యానికి రూ.32 కమీషన్ ఇస్తుండడంతో ఆ డబ్బు మహిళల కుటుంబాలకు దోహదపడనున్నది. ఈ సీజన్‌లో సాధ్యమైనన్నీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను అప్పగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎంపిక చేసిన మహిళలకు కేంద్రాల నిర్వహణపై ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు.

● పెరిగిన సాగు విస్తీర్ణం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగు విస్తీర్ణం ఆధారంగా కొనుగోలు కేంద్రాలను పెంచారు. మహిళా సంఘాలు నిర్వహిస్తున్న కేంద్రాలతోపాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొన్ని కేంద్రాలను నిర్వహించారు. కరోనా సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామానికి ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఎక్కువ కొనుగోలు కేంద్రాలు సహకార సంఘాల చేతికి వెళ్లాయి.

ప్రస్తుతం మహిళల చేతిలో 30 శాతం సంఘాలు మాత్రమే ఉన్నాయి. గడిచిన వానాకాలం సీజన్‌లో 617 కోట్ల 72 లక్షల రూపాయల విలువైన 2,66,281 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 47,209 మంది రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఇందులో దొడ్డు రకం ధాన్యం 63వేల 268 మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 2,03,013 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు చేసినందుకు కేంద్రాల నిర్వాహకులకు సుమారు 75 లక్షల కమీషన్ చెల్లించాల్సి ఉంటుంది. సంఘాలకు కమీషన్ పెద్ద ఎత్తున వస్తుండడంతో స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగించాలని ఆలోచిస్తోంది.

● ధాన్యం కొనుగోలు ఇలా..

యాసంగి సీజన్ నుంచి రాష్ట్రంలోని సగం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కసరత్తు చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికా రులు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యానికి మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో 2006-07 నుంచి కొనుగోలు కేంద్రాలను అప్పటి ప్రభుత్వం ఏ ర్పాటు చేసింది. ఐదు నుంచి పది గ్రామాలకు కలిపి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల నిర్వ హణ బాధ్యతను స్వశక్తి సంఘాల మహిళలకు అప్ప గించారు. ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల కార్పొ రేషన్ ద్వారా మహిళలకు కమీషన్ చెల్లించారు. ఈ డబ్బులను గ్రామైక్య సంఘానికి, కేంద్రాన్ని నిర్వహి ంచిన మహిళలకు కొంత అంద జేశారు. ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లలో మద్దతు ధర చెల్లించడమే కాకుండా, సంచి కిలో, మట్టి కిలో చొప్పున తరుగు తీయడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతోపాటు తరుగు లేకుండా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపారు.

సీతారాముల కళ్యాణం

చూతము రారండి

- ముస్తాబైన ఆలయాలు
- ఎదుర్కోళ్లు, పాలపారకతో మండపాల అలంకరణ



ఖని కోదండ రామాలయం స్వాగత తోరణం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని కోదండ రామాలయం సీతారాముల కల్యాణ మహోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈనెల 2వ తేదీ సాయంత్రం నుంచి అధ్యయన ఉత్సవాలతో కల్యాణమహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో, ఉత్సవ కమిటీ ఆలయాన్ని ముస్తాబు చేశారు. మరో మినీ భద్రాచలంగా పిలవబడే ఈ కోదండ రామాలయంలో యేటా అంగరంగ వైభవంగా భద్రాచలం ముహూర్తానికే 12.05 నిమిషాలకే ఇక్కడ కోదండ రామయ్యతో సీతమ్మ వారి మేడలో అర్చకులు తాళికట్టిస్తారు. ఆరుబయటనే లక్షల మంది భక్తజనం కన్నురాల వీక్షించి తరిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారీ స్వాగతతోరణాన్ని ఏర్పాటు చేశారు. కళ్యాణ వేదికను విశాలమైన వేదికగా ఏర్పాటు చేశారు. ఎంత మంది వచ్చినా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. కల్యాణం వీక్షించేందుకు ఆరుబయట (మిగతా 8వ పేజీలో)



కల్యాణానికి ముస్తాబైన కోదండ రామాలయం

కమిషనరేట్‌లో కొనసాగుతున్న బదిలీల పర్వం

● వారం రోజుల్లో 27మంది సిబ్బంది బదిలీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో బదిలీల పర్వం కొనసాగుతోంది. సీపీగా అంబర్ కిశోర్ ఝా బాధ్యతలు స్వీకరించిన తరువాత చర్యలకు ఉపక్రమించారు. పాలనపరమైన వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉండడం, ఠాణాల్లో అవినీతి పెరిగిపోవడం, పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చడం, అక్రమ దందాల నుంచి మామూళ్లు తదితర ఆరోపణల నేపథ్యంలో ప్రక్షాళనకు ఉపక్రమించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలోని టాస్క్‌ఫోర్స్ టీములను ఇతర విభాగాలకు పంపారు. ఎస్‌బీతోపాటు ఇతర నెట్‌వర్క్ ద్వారా ప్రతీ ఠాణాపై నిఘా పెట్టినట్టు చర్చ జరుగుతుంది. ఠాణాల్లో వసూళ్ల నెట్‌వర్క్‌కు చెక్ పెట్టే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రతీ ఠాణా పరిధిలో మద్యం, బెల్ట్ షాపులు, రేషన్ దందా, ఇసుక, స్క్రాప్, తదితర వాటి నుంచి ఒక్కో ఠాణాకు నెల వారీగా లక్ష నుంచి రూ.5లక్షల వరకు మామూళ్లు ఉన్నాయి. మామూళ్ల వసూళ్లకు ఆయా ఠాణాల పరిధిలో ప్రత్యేక సిబ్బంది ఉన్నారు. వీరికి తోడు క్రైమ్ పార్టీల మామూళ్లు అదనం. ఈ విషయంలో కిందిస్థాయి సిబ్బంది మధ్య వివాదాలు, ఉత్తరాలు రాసుకోవడం పరిపాటి అయ్యింది. దీంతో దీనికి చెక్ పెట్టే దిశగా చర్యలు ప్రారంభించారు. వివిధ ఠాణాల్లో ఈ తరహా సిబ్బంది వివరాలను సేకరించినట్టు తెలుస్తున్నది. ఇటీవల అకస్మాత్తుగా రెండు విడుతలుగా 27మంది సిబ్బందిని బదిలీ చేశారు. దీంతో కమిషరేట్ పరిధిలోని సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు.

ట్రాఫిక్ సమస్యలపై డీఎం, సీఐ పరిశీలన



బస్టాండ్ వద్ద రహదారిని పరిశీలిస్తున్న సీఐ, డీఎం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ ఎదుట ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి శనివారం గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం, రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు పరిశీలించారు. బస్టాండ్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా దీనిపై ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్‌తో చర్చించామని, బస్టాండ్ ఆవరణలో మోటార్ సైకిళ్లను నిలుపడం వల్ల ప్లాట్‌ఫాం వద్ద బస్సులు నిలుపడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గతంలో రాజీవ్ రహదారి నుంచి బస్టాండ్‌కు వచ్చేందుకు రెండు దారులు ఉండేవని, వాటిని ఒకే దారి గుండా పంపుతున్నామని, ఈ రోడ్డుపై ఆటోలు నిలుపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి



కొత్తపల్లె గ్రామంలో మాట్లాడుతున్న పెద్దపల్లి సీఐ కె వేణుగోపాల్

పాలకుర్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని సీఐ వేణుగోపాల్ అన్నారు. శనివారం కొత్తపల్లెలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ కొత్తపల్లెలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి, గ్రామ పోలీస్ అధికారి నరేందర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటిసి ప్రియాంక మహేష్, మాజీ ఉపసర్పంచ్ బుట్టి శ్రీకాంత్ పాల్గొన్నారు.

'అంబేద్కర్ విగ్రహం తరలించం'

కోల్‌సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం తరలింపు ఉండదని, దీనిపై కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని కమిషనర్ అరుణ శ్రీ పేర్కొన్నారు. శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. రోడ్డు వెడల్పులో అంబేద్కర్ విగ్రహం తొలగిస్తారని, ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై ప్రజలు అపోహలకు, ఆందోళనలకు గురి కావదని ఆమె పేర్కొన్నారు.

మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ● పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకువెళ్లాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలో గల డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి, సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంటరానితనం పరిస్థితుల నుంచి ఉపప్రధాని పదవి వరకు అనేక అంశాలను బాబుజగ్జీవన్‌రామ్ చూశారని కలెక్టర్ తెలిపారు. 29ఏళ్ల వయస్సులో శాసనమండలి సభ్యుడిగా, 1937లో బీహార్ అసెంబ్లీకి ఎన్నికయ్యారని తెలిపారు. 30 సంవత్సరాల పాటు వివిధ మంత్రిత్వ శాఖలలో పనిచేశారని తెలిపారు. దళితుల అభ్యున్నతి కోసం చిన్నతనం నుంచే ఆయన కృషిచేశారని, అనేక ఒడిదుడుకులను తట్టుకొని నిలబడ్డారన్నారు. మహనీయుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రవేశపెట్టిన పథకాలను జిల్లా యంత్రాంగం అమలు చేస్తుందని తెలిపారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ సుదీర్ఘకాలం రాజకీయ జీవితాన్ని గడిపిన వ్యక్తి అని పేర్కొన్నారు. అంతకు ముందు వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, రెవెన్యూడివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, టిఎన్‌జిఓ అధ్యక్షుడు బొంకూరి శంకర్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, ఎస్సీ, బీసీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

కమిషరేట్‌లో...

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా జరిగాయి. కమిషనర్ అంబర్ కిశోర్ ఝా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆధునిక భారత నిర్మాణంలో స్ఫూర్తి వంతమైన సేవలందించారని, గొప్ప రాజకీయ వేత్తగా, సామాజిక సమానత్వం కోసం జీవిత కాలం పోరాడారన్నారు. బడుగు వర్గాల అభ్యు న్నతికి కృషి చేశారన్నారు. దేశ రక్షణ మంత్రిగా సురక్షిత సేవలు అందించారన్నారు. ఆయన దేశా నికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్‌స్పెక్టర్లు సతీష్, ప్రేమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో నివాళులు...

నగరపాలక సంస్థ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమా రస్వామి, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సమాజంలో న్యాయవాద వృత్తి
మహోన్నతమైనది 6
● హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ చంద్రయ్య

ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగులకు
మెరుగైన పెన్షన్ పథకం 7
● హెచ్ఆర్ అధికారుల చొరవతో ఈపీఎస్-95 పెన్షన్ స్కీం

సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుంది



సన్నబియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌తో పాటు పలుగ్రామాల్లో సీసీరోడ్లు, సన్నబియ్యం పేదలకు అందించే కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా రాష్ట్రంలో పేద కుటుంబాలకు సన్నబియ్యం అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి మండలానికి సాగునీరు అందించి రైతుల పంటలు కాపాడామన్నారు. సన్నవడ్లు పండించే రైతులందరికీ బోనస్ ఇవ్వడంతో పాటు రెండు లక్షల రుణమాఫీ కూడా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా గతంలో రాష్ట్రం 60వేల కోట్ల అప్పు ఉంటే పది సంవత్సరాలు పాలించిన బీఆర్‌ఎస్ 7.30 లక్షలు అప్పు చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల మీద ఎలాంటి భారం వేయ కుండా అప్పు, వడ్డీ కడుతున్నారన్నారు. అనంతరం సోన్నాయి టెంకం లక్ష్మయ్య స్మారక చలివేంద్రంను ప్రారంభించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, తహసీల్దార్ జగదీశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో పూర్ణచంద్రరావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, సబ్బని రాజమల్లు, పాల్గొన్నారు.

లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం కాలనీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారు. 18వ డివిజన్ గంగిరెద్దుల(మహారాజుల) వారు నివసించే గుడిసెలను ఎమ్మెల్యే సందర్శించారు. సన్నబియ్యంతో చేసిన వంటలను వారితో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. అనంతరం కాలనీలోని ఐదు డివిజన్‌లకు చెందిన తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు 17వ డివిజన్ రేషన్ షాప్‌లో ఎమ్మెల్యే సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి నిబద్ధతతో పని చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. బియ్యాన్ని ఉచితంగా అందించడం ద్వారా పేద ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలబడడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్పొరేటర్లు సాగంటి శంకర్, శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు రాజిరెడ్డి, జక్కుల దామోదర్‌రావు, అనుము రాములు, దేవనపల్లి చక్రపాణి, తిరుపతిరెడ్డి, వై తిరుపతి, మేరుగు రాజేశం, సునీత సాంబయ్య, సారయ్య నాయక్, అవినాష్ పాల్గొన్నారు.



గంగిరెద్దుల గుడిసెల్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సేంద్రియ సాగు శిక్షణకు ఇటిక్యాల రైతు



శాస్త్రవేత్తతో రైతు రాజేందర్‌రెడ్డి

రాయికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరుగుతున్న సేంద్రియ సాగు శిక్షణకు రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికిచెందిన రైతు గడ్డం రాజేందర్ రెడ్డిని ఎంపిక చేయగా మౌంట్ అబులో శిక్షణ పొందుతున్నాడు. ఈసందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ సాగులో మెళకువలు నేర్పిస్తున్నారని తెలిపాడు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

అందని బిల్లులు...ఆగిన పనులు

- ఏళ్లుగా ముందుకు సాగని నిర్మాణ పనులు

గంగాధర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు అధికారుల నిర్లక్ష్యంగా ఏళ్లుగా ముందుకు సాగడంలేదు. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు వదిలేయడంతో అసంపూర్తిగా ఉన్న భవనాలు దర్శనమిస్తున్నాయి. గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో పాఠశాల భవనానికి గత ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు మంజూరు చేసింది. స్లాబు పూర్తి చేసి లోపల ఒక వైపు గోడలు, ఫ్లోరింగ్ పనులు పూర్తయ్యాయి. 2.65 లక్షల బిల్లు మంజూరైంది. మిగతా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశాడు. ప్రహరీ, లోపల గోడలు నిర్మించాలి. మిగులు పనులకు 2.25 లక్షలు మంజూరైనట్లు సమాచారం. పాఠశాల పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుండైనా వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



లక్ష్మీదేవిపల్లిలో పాఠశాల భవనం

- అద్దె భవనంలో పల్లె దవాఖాన

మండలంలోని కురిక్యాల పల్లె దవాఖాన అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. సొంతభవన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం 21 లక్షల నిధులు మంజూరయ్యాయి. స్లాబు వేసిన కాంట్రాక్టర్ బిల్లులు రాక మధ్యలో వదిలేశాడు.



కురిక్యాలలో అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖాన భవనం

- ఇదే గ్రామంలోని పాఠశాలకు మన ఊరు మనబడి పథకం కింద 14 లక్షల రూపాయలు మంజూరయ్యాయి.ది. ఈ నిధులతో కిచెన్ షెడ్డు, టాయిలెట్లు నిర్మించాలని నిర్ణయించారు. నిధులు సరిపోక కిచెన్‌కు పిల్లర్లు వేసి వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులకు నిధులు విడుదల చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నంబర్‌ప్లేట్ లేని 14 బైక్‌లు సీజ్



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై రవి

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, మైనర్‌డ్రైవింగ్‌పై పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్‌ప్లేట్ లేని 14ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించి సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



సంపత్ కుమార్

జమ్మికుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్‌పరిధిలోని పాత వ్యవసాయ మార్కెట్ ప్రాంతానికిచెందిన భూపతి సంపత్ కుమార్ కనపడటం లేదని అతడి భార్య హేమ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపినవివరాల ప్రకారం.. సంపత్ కుమార్ పదిసంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాడు. తరుచూ ఇంట్లో ఆర్థిక పరిస్థితి చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈనెల 5న ఉదయం 10.30గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఫలితం లేకుండా పోయింది. ఫోన్‌కూడా స్విచ్ఛాఫ్ రావడంతో సంపత్‌కుమార్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ధర్మపురి పోలీసులు శనివారం కనుగొన్నారు. నదిలోగల బండరాళ్ల కింద మృతదేహం కుళ్లిపోయి ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని టీఆర్ నగర్ కాలనీకి చెందిన షేక్‌నజీర్ అనేవ్యక్తి నుంచి 131గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. జగిత్యాల మండలం ధరూర్‌శివారులో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా నజీర్ అనే వ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నజీర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మానవాళికి శ్రీరాముడి జీవితం ఆదర్శం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మానవాళికి శ్రీరాముని జీవితం ఆదర్శమని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్ముల సత్యం అన్నారు. విశ్వహిందూ పరిషత్ గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో శనివారం కోదండ రామాలయంలో జరిగిన శ్రీరామోత్సవంలో ఆయన ప్రసంగించారు. యువత సన్మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలన్నారు. నేటి యువతరం శ్రీరామ రాజ్యాన్ని నిర్మించాలని నాదేశం-నాధర్మం అనే నినాదంతో యువతీ యువకులు ముందుకు సాగాలన్నారు. సమాజంలో మాతృమూర్తుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, గోరక్ష ప్రముఖ్ ఇసంపెల్లి వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, కొండపర్తి లింగన్న, మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, ములుకుంట్ల శ్రీనివాస్, పిన్నింటి శ్రీనివాస్, పారిపల్లి చక్రపాణి, అరవింద్, కోట తిరుమల, సూర్యదేవర జ్యోతి, లలితమ్మ, స్వప్న, మమత, స్వరూప, పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన రాగుల శ్రీనివాసచారి కరీంనగర్ నుంచి తాడికల్ వస్తున్నాడు. తాడికల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుల వద్ద ఒడిస్సాకు చెందిన డీబీఎల్ కంపెనీలో పనిచేసే కృష్ణ ఎదురెదురుగా రావడంతో రెండుబైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనివాసచారికి, కృష్ణకు గాయాలు కావడంతో స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలి



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి ఫొటోను సీసీ ఫుటేజీ ఆధారంగా శనివారం టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ విడుదల చేశారు. పోలీసుల వద్ద ఉన్న సమాచారం మేరకు మృతిచెందిన వ్యక్తి రాకేష్ అయి ఉంటాడని భావిస్తున్నామని హుజూరాబాద్ ప్రాంతానికి ఎందుకు వచ్చాడో తెలియడం లేదన్నారు. ఫోటోలో ఉన్న వ్యక్తిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సమాజంలో న్యాయవాద వృత్తి మహోన్నతమైనది



మానవ హక్కుల కమిషన్ మాజీచైర్మన్ జస్టిస్ చంద్రయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జడ్జి దుర్గేష్

సుల్తానాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజంతో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు పరిష్కారాన్ని చూపించే న్యాయవాద వృత్తి మహోన్నతమైనదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. శనివారం సుల్తానాబాద్ కోర్టును సందర్శించిన ఆయన బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను సమాజంలో అమలుపరచని సందర్భాలలో వాటిని సవ్యమైన మార్గంలో నడిపించేందుకు న్యాయవాదులు సేవ చేయాలని అన్నారు. న్యాయవాదులకు చట్టాలు, రాజ్యాంగ హక్కులు పట్ల అవగాహన కల్పించారు. కాగా జస్టిస్ చంద్రయ్యకు సుల్తానాబాద్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి సన్మానించారు. బార్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి,న్యాయవాదులు కలసి జస్టిస్ చంద్రయ్య ను ఘనంగా సన్మానించారు. బార్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, సీనియర్ న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజంయాదవ్, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, బాలకిషన్ ప్రసాద్,మాడూరి అంజనేయులు, జోగుల రమేష్, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేశ్, బిబ్బిలి శ్యామ్, కరుణాకర్, లెక్కల గంగాధర్, తిరుపతి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగిన విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బొంకూరు గ్రామంలో విద్యుత్‌స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. పలు వీదుల్లో విద్యుత్‌స్తంభాలు పూర్తిగా ఇళ్లపైకి ఒరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు వస్తే ఇంటిపై స్తంభంకూలితే భారీప్రమాదం చోటు చేసుకుం టుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని ఇళ్లపై ఒరిగిన విద్యుత్‌స్తంభాలను సరిచేసి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పెద్దబొంకూరులో ఇళ్లపైకి ఒరిగిన విద్యుత్ స్థంభం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఆము దాలపల్లి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్య దర్శి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ విధులు ముగించుకొని స్వగ్రామమైన జమ్మికుంటకు ద్విచక్ర వాహ నంపై వెళ్తున్నాడు. ఆముదాలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై పడి పోయి ఉండగా, ఆటుగా వెళ్తున్న రైతులు గమనించి రోడ్డు పక్కకు తీసుకెళ్లి 108కుసమాచారం అందించారు. చికిత్సనిమిత్తం 108లో ఆస్పత్రికి తరలిం చారు. కాగా ఈప్రమాదానికి సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

స్వాతంత్ర్య సమరయోధుడు కాంతారావుకు కన్నీటి వీడ్కోలు



పాడె మోస్తున్న సీపీఐ నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు తెలంగాణ సాయుధపోరాటవీరుడు(సీపీఐ) సుల్తాన్‌పూర్ మాజీసర్పంచ్ తానిపర్తి కాంతారావుకు ప్రజలు, నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం ఆయన మృతిచెందగా శనివారం సుల్తాన్‌పూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అధికారులు, ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా జరిగినఉద్యమంలో చురుకుగా పాల్గొన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గాపనిచేసి ప్రజలకు విశేషసేవలు అందించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్‌డీవో గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐశేఖర్‌లు కాంతారావు పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శులు తాండ్రసదానందం, మర్రివెంకటస్వామి అంత్యక్రియల్లో పాల్గొని ఎర్ర జెండాను కప్పారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడేమోశారు. మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

- నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

మహాముత్తారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పడంతో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదవరిఖనికి చెందిన బోగిరి విజయ్‌కుమార్, ఎం అశోక్, శేఖర్, రాంరెడ్డి మహాముత్తారం మండలం మీదుగా ములుగు జిల్లా మేడారం వెళ్తుండగా యామన్‌పల్లి సమీపంలో ఈ ఘటన జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు ధ్వంసమై నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరు స్వల్పంగానూ, ముగ్గురు తీవ్రంగానూ గాయపడినట్టు తెలిసింది. క్షతగాత్రులను 108 సిబ్బంది భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర కుమార్ తెలిపారు.

మట్టి కుండ పోయి ప్లాస్టిక్ బిందె వచ్చె!

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీసి నిల్వ చేయడం కోసం గతంలో గీత కార్మికులు లొట్టిలు(కుండలు) వినియోగించేవారు. కులవృత్తులకు ఆదరణ తగ్గడంతో కుమ్మరులు కుండలు చేయడం మానేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కుండలు అందుబాటులో లభించకపోవడం, కోతుల బెడద అధికమవడంతో ఈత చెట్ల నుంచి కల్లు తీసేందుకు గీత కార్మికులు లొట్టిల(కుండలు)కు బదులు ప్లాస్టిక్ బిందెలను వాడుతున్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ఈత చెట్లకు ఇలా ప్లాస్టిక్ బిందెలను కట్టి కల్లును సేకరిస్తున్నారు. ప్లాస్టిక్ బిందెలు వాడడం వల్ల కోతులు అటు ఇటు తీసేసిన కింద పడి పగిలిపోకుండా ఉంటుందని గీత కార్మికులు పేర్కొంటున్నారు.



ఈత చెట్లకు కట్టిన ప్లాస్టిక్ బిందెలు

ప్రజా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న హైద్రాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాధర్నా పోస్టర్లను శనివారం యైటింక్లయిన్‌కాలనీ, రామగిరి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ ఐఎఫ్‌టీయూ ఆఫీస్‌లలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. డివిజన్ కార్యదర్శి బీ అశోక్ మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండను సృష్టిస్తున్నాయన్నారు. వందలాది మందిని ఎన్‌కౌంటర్ల పేరిట బలి తీసుకుంటున్నారని, అడవుల్లోని అపార ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే కగార్ పేరిట హత్యాకాండ సాగిస్తున్నాయని అశోక్ పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థి యువజన సంఘాలు కేంద్ర వైఖరిని ఖండించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈనెల 8న హైద్రాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ప్రజాదర్బార్‌కు కార్మికులు, ప్రజలు తరలిరావాలని అశోక్ పిలుపునిచ్చారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మధ్య మానేరు నిర్వాసితులను..
గుండెల్లో పెట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమే

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రవరంలో ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు నిర్వాసితులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, అనుపురం, చింతలఠాణ, చీర్లవంచ, కొడుముంజ, శాభాష్‌పల్లి, గుర్రంవానిపల్లి గ్రామాల ప్రజలకు ఉపాధిహామీ పథకాన్ని రుద్రవరంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ మండలంలోని నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూశానని, వారిత్యాగం మరువలేనిదన్నారు. నిర్వాసితులకు ఉపాధికల్పనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నానని గుర్తుచేశారు. 9గ్రామాల్లో 3500 మంది ఉపాధిహామీ నిర్వాసిత కూలీలకు 100 రోజులు పని కల్పిస్తున్నామన్నారు. ఒక్క రోజు పనికి రూ.300పైచిలుకు చెల్లిస్తున్నామని, జాబ్‌కార్డు లేని వారికి జాబ్ కార్డులు అందించి పని కల్పిస్తామన్నారు. ఉపాధిహామీ పనికి వెళ్లడం ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికికూడా అర్హులు అవుతారని సూచించారు. ప్రజలందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుద్రవరం గ్రామానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైసింగ్ తెలంగాణగా ముందుకుపోతుందన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో మల్హోత్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, చింతపల్లి శ్రీనివాస్‌రావు, ఎర్రం రాజు, గాలిపెల్లి స్వామి ఉన్నారు.

ఆలయాలు మానవతా వికాస కేంద్రాలు



మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానవతా వికాసకేంద్రాలుగా విలసిల్లుతున్నాయని, ప్రజలకు సేవలందించే విధంగా మనపూర్వీకులు ఆలయాలను రూపొందించారని జాతీయ సాహిత్యపరిషత్ పూర్వ జాతీయఅధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జాతీయ సాహిత్యపరిషత్ కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం కొత్తపల్లి చిన్నగుట్టపై స్వయంభూ వేంకటేశ్వరాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడారు. దేవాలయాలు ఆధ్యాత్మికతతోపాటు అన్న సత్రాలుగా, అనాథాశ్రమాలుగా, ధర్మ సత్రాలుగా, విద్యా, వైద్య, వేద, కళా, సాంస్కృతిక కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయన్నారు. పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ లెక్కల రాజభాస్కర రెడ్డి, పరిషత్‌తెలంగాణ అధ్యక్షుడు వద్దూరి ఆంజనేయరాజు. నరహరి నారాయణరెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ వాసాల రమేశ్, సంస్థ ప్రధానకార్యదర్శి నంది శ్రీనివాస్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న రచయిత్రులు

నేడే రామయ్య కల్యాణమహోత్సవం

• హాజరుకానున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న సన్నిధిలో రామయ్య దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించేందుకు ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వేములవాడకు తరలిరానున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 11.55 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీస్వామివారి కల్యాణతంతు నిర్వహించనున్నారు. సాయంత్ర 5 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు డోలోత్సవము ఘనంగా నిర్వహించనున్నారు. రాజన్న ఆలయానికి సుమారుగా 50 వేల వరకు భక్తులు తరలి రానున్నారని, దానికి అనుగుణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలె త్తకుండా ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ వీరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాజన్న ఆలయంలోని ఈవో కార్యాలయం ముందు ప్రత్యేక కల్యాణ మండపం పైన శ్రీస్వామి వారి కల్యాణాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బారికేడ్స్‌తో గ్యాలరీలను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణ మహోత్సవానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.


కల్యాణానికి ఏర్పాటు చేసిన బారికేడ్లు


కల్యాణవేదిక ఏర్పాట్లు

• భక్తులు ఇబ్బందులు లేకుండా చర్యలు..

శ్రీసీతారాముల కల్యాణాన్ని వేములవాడ రాజన్న ఆలయంలో అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, భక్తులను దృష్టిలో పెట్టుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులకు ఉచిత భోజన వసతిని, వేసవి కాలం కావడంతో చల్లని తాగునీరు. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ధర్మపురి నుంచి పట్టువస్త్రాలు.. తలంబ్రాలు


ధర్మపురి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ఆలయ ఈవో, ధర్మకర్తలు

ఇల్లందకుంట/ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయానికి ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ పట్టువస్త్రాలు.. ముత్యాల తలంబ్రాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈఏడాది కూడా స్వామివారి కల్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశామన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఈవో, ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, ధర్మపురి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపిక


వినీత్

హుజూరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన మోటపోతుల వినీత్ ఈ నెల7 నుంచి 14 వరకు ఒడిషాలోని భువనేశ్వర్‌లో జరిగే 73వ ఆల్ ఇండియా హాకీ పోలీస్‌మీట్‌కు ఎంపికయ్యాడు. వినీత్ హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో సిటీ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వినీత్ ఎంపికపై హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, శంకర్, ఉమామహేశ్వర్, సజ్జు, యూసుఫ్, రమేష్, తిరుపతి హర్షం వ్యక్తం చేశారు.

రాజన్న ఆలయంలో కొనసాగుతున్న వేడుకలు

• ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు
• రాజన్న సేవలో పలువురు ప్రముఖులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేమలవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీరామనవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో స్వామి వారితో పాటుగా శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీఅనంతపద్మనాభస్వామి అనుబంధ పరివార దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వార్లకు భక్తోత్సవము, హవనములు కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు.

• దర్శించుకున్న ప్రముఖులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు సిద్దిపేట జిల్లా జడ్జి సాయిరమాదేవి, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కే. జ్యోతి వేములవాడకు వచ్చారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అర్చకులు స్వస్తి వేదోక్త స్వాగతం పలికారు. శ్రీరాజరాజేశ్వర స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వెంట ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, శ్రీకాంచారి, రాజేందర్ తదితరులు ఉన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

• రాజన్న గోశాల, అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు, అన్నదాన ట్రస్ట్‌కు హైద్రాబాద్ నగరానికి చెందిన మదికంటి సృజన్ - స్వాతి దంపతులు విరాళం ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. రాజన్న ఆలయ గోశాలకు రూ. ఒక లక్ష, అన్నదాన ట్రస్ట్‌కు రూ.1.50 లక్షలు, శ్రీస్వామివారికి రూ.63 వేలు 638 విరాళంగా చెక్కు రూపంలో అందించారు. వారి వెంట ఆలయ అకౌంటెంట్ ఆగంరావు ఉన్నారు.

వేములవాడలో సందడి

• కల్యాణానికి తరలివచ్చిన భక్తులు


రాజన్న ఆలయం వద్ద ఆటపాటలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి వేములవాడకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి రాజన్న ఆలయానికి భక్తుల రాక ఒక్కసారిగా పెరిగింది. రాత్రి 7 గంటల వరకు రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటుగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీసీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి జోగినీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయం ముందు జోగినీలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారిియి. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో జడల రమేష్ ఏర్పాటు చేసిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పలు విభాగాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్యాణం ఏర్పాట్లను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.


ఆలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు, జోగినులు

రాజన్న ఆలయ అన్నదాన ట్రస్టుకు విరాళం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజ్వశ్వర స్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు వేములవాడ మండలం చింతలఠాణ గ్రామానికి చెందిన నిమిశకవి శ్రీకాంత్ స్రవంతి దంపతులు విరాళం అందజేశారు. శనివారం కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్న అనంతరం అన్నదాన ట్రస్టుకు రూ. లక్ష, 41 వేయి 116లు ఏఈవో జయకుమారికి అందజేశారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న అర్చకుడు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద శనివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంతు గౌడ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హోమాలు, చండీయాగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో నిత్య పూజలను నిర్వహిస్తామన్నారు. శనివారం చండీయాగాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు మోడెం సురేందర్, బాలసాని స్వామిగౌడ్, వంగ శ్రీనివాస్, పొన్నం అంజయ్య, జనార్దన్(లడ్డు), కోడూరి రవి, మేరుగు యాదగిరిగౌడ్, అశోక్, సాయిలీల సురేష్, రాయమల్లుగౌడ్ పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి


కొండగట్టులో ఆలయం వద్ద భక్తులు


జయంతి కోసం కొండగట్టులో ఏర్పాటు చేసిన బారికేడ్లు

మల్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా వచ్చిన భక్తులు, దీక్షాపరులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

• నేడు శ్రీరామనవమి వేడుకలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించడానికి దేవస్థానం తరపున ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక వేదికపై రాములోరి కల్యాణం వేడుకగా జరుపనున్నారు.

చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

కొండగట్టులో జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సగానికి పైగా పొడగాటి కర్రలతో బారికేడ్లు, క్యూలైన్‌లు ఏర్పాటు చేయగా ఈసారి ఇనుప వాటితో ఆలయం ముందు, వెనుకాల ఏర్పాటు చేశారు. మరిన్నింటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

వైభవంగా కుంకుమ పూజలు

పెగడపల్లి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నామాపూర్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు, ప్రధాన కలశస్థాపన నిర్వహించి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నామాపూర్‌లోని రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

బంగారం తరలింపు వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

• మరో ఇద్దరి కోసం గాలింపు • వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వీరప్రసాద్

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియా నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని మాయం చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రుద్ర రాంప్రసాద్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉన్న తన సమీప బంధువు రవీందర్ ద్వారా 400 గ్రాముల బంగారాన్ని తెప్పించుకునేందుకు 35 లక్షల రూపాయలు పంపించాడు. దీంతో రవీందర్ బంగారం ఇండియాకు పంపించే ప్రయత్నాలలో భాగంగా వేములవాడకు చెందిన కాల్వ వెంకటేష్ అనే వ్యక్తి ద్వారా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన తౌంటి బీరయ్య, గడ్డం అనిల్ ఇండియా వెళుతున్నారని తెలుసుకొని వీరి ద్వారా 400 గ్రాముల బంగారం పంపించాడు. సౌదీ నుంచి బయలుదేరుతున్న సమయంలో తాము పెద్ద మొత్తంలో బంగారం ఇండియాకు తీసుకువస్తున్న విషయాన్ని తమ సమీప బంధువు ఏనుగుల నాగరాజుకు సమాచారం ఇవ్వడంతో ఈ మొత్తం బంగారాన్ని కాజేయాలని పథకం పన్నారు. హైదరాబాదులోని విమానాశ్రయంలో దిగిన వెంటనే అక్కడకు చేరుకున్న నాగరాజుకు బంగారం ఇవ్వడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని ఏఎస్పీ వివరించారు. సౌదీ నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని రాంప్రసాద్‌కు అప్పగించాల్సిన బీరయ్య, అనిల్ అందుకు బదులుగా నాగరాజుకు అప్పగించిన విషయం తెలుసుకున్న రాంప్రసాద్ తాను మోసపోయినట్లు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సంఘటనలో బీరయ్య, అనిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, కాల్వ వెంకటేష్, ఏనుగుల నాగరాజు పరారీలో ఉన్నారని ఆమె వివరించారు. పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ఇద్దరు ఎస్ఐలతో కూడిన ఆరుగురు సభ్యుల బృందాన్ని ఏర్పాటుచేసి గాలింపు చేపట్టామని, విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల కన్ను కప్పి పెద్ద మొత్తంలో బంగారం తీసుకువచ్చిన వ్యవహారం వెనుక ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మిగిలిన నిందితులను పట్టుకుని బంగారం స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ సీఐ వీరప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బాలుడి వీరంగం

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ బాలుడు వీరంగం సృష్టించాడు. మత్తు పదార్థాలకు అలవాటు పడి శనివారం ఇంట్లో ఉన్న తన సోదరిని చితకబాదగా మందలించిన తల్లిపై బండరాయితో దాడి చేసేందుకు యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. స్థానికులు ఆ బాలుడిని ఇంట్లో బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకొని 100 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలు


ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) సిక్దర్‌ను అభినందిస్తున్న మాజీ ఉద్యోగులు

జ్యోతినగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలుకు మార్గం సుగమమైంది. గతంలో ఉన్న ఈపీఎస్-95 కింద కనిష్ఠ స్థాయిలో పెన్షన్ పొందిన రిటైర్డ్ ఉద్యోగులు ఇకముందు నిజవేతనాలపై(హయ్యర్ వేజెస్) ఈపీఎస్ 95 స్కీం కింద గరిష్ఠంగా పెన్షన్ పొందనున్నారు. రామగుండం ఎన్టీపీసీ మానవ వనరుల(హెచ్‌ఆర్) విభాగం అధికారులు చొరవతో కొత్త పెన్షన్ పథకానికి మోక్షం లభించింది. హయ్యర్ వేజెస్‌పై పెన్షన్ ఇవ్వాలని ఎన్టీపీసీ మాజీ ఉద్యోగులు న్యాయం పోరాటం చేశారు. గతంలో సుప్రీంకోర్టు నిజవేతనాలపై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీంను రిటైర్డు ఉద్యోగులకు అమలు చేయాలని తీర్పు ఇచ్చింది. 01-09-2014 తరువాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఈ పథకం అమలు చేయాల్సి ఉంటుంది. రామగుండం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులు కరీంనగర్‌లోని పీఎఫ్(ఈపీఎఫ్‌వో) అధికారులతో ఈపీఎస్ 95పై సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో సుమారు 398 మంది రిటైర్డు ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీం అమలు కానుంది. మెరుగైన పెన్షన్ అమలయ్యేలా కృషి చేసిన హెచ్‌ఆర్ ఏజీఎం(హెచ్‌వోడీ) విజయ్ కుమార్ సిక్దర్, అధికారులను ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అభినందించారు. హయ్యర్ వేజెస్‌పై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీం అమలుకు కృషి చేసిన ఎన్టీపీసీ మానవ వనరుల అధికారులను రామగుండం ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం సంఘం అధ్యక్షుడు ఎ.రాంకిషన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలి


మాట్లాడుతున్న టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి థామస్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగించనున్నామని, కార్మికులందరూ సన్నద్ధం కావాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం చర్యలతో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సోమవారం లేబర్ కమిషన్ కార్యాలయంలో సమ్మె తేదీని ప్రకటించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు, కొత్త నియామకాలు లేవన్నారు. ఉద్యోగుల పీఎఫ్ ట్రస్టులో ఉన్న డబ్బులను యాజమాన్యం వాడుకుందన్నారు. దీంతో ఉద్యోగులు పీఎఫ్ డబ్బులు తీసుకునే వీలు లేకుండా పోయిందన్నారు. గత సర్కార్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో విలీనం అంశం ఉందని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. మహాలక్ష్మి పథకానికి తాము వ్యతిరేకం కాదని, ఆడబిడ్డలకు అండగా ఆర్టీసీ ఉద్యోగులు ఉంటారని, దానికనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈవీ బస్సులను తీసుకు వచ్చి డిపోలన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని డిపోలను ప్రైవేట్ పరం చేశారన్నారు. కేంద్రం ఎలక్ట్రిక్ బస్సులపై ఇస్తున్న సబ్సిడీని ప్రైవేట్ సంస్థలకు కాకుండా ఆర్టీసీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్‌లు లేవని యాజమాన్యం ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సమావేశంలో ఈబీ రావు, అంజిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలని ఆందోళన


కథలాపూర్‌లో సాధన సమితి సభ్యుల నిరసన

కథలాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు కింద ఎంపికైన వారికి రెండో విడత నిధులు విడుదల చేయాలని శనివారం కథలాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సాధన సమితి సభ్యులు ఆందోళన చేశారు. కలెక్టర్ల అకౌంట్లలో దళితబంధు నిధులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎంపిక చేసిన వారికి లబ్ధి చేకూర్చడం లేదని ఆరోపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేడ్కర్ అభయహస్తం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాధన సమితి అధ్యక్షుడు తీట్ల శంకర్, తరి రవి, తరి రమేశ్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి

కమాన్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ అన్నారు. సిద్ధిపల్లెలో శనివారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్‌లో జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మాజీ జడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, మాజీ సర్పంచ్ కొండా వెంకటేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, సీఏఎస్ వైస్ చైర్మన్ చిందం తిరుపతి, మాజీ ఉపసర్పంచ్‌లు జూమ సతీష్, పోలుదాసరి సాయికుమార్, నాయకులు నీలం శ్రీనివాస్, రాచకొండ రవి, రెడ్డి రాయనర్సు, దండె కిషన్, జాబు శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



ఓదెలలో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఓదెల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దళితకాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించడంపై శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం దళితుల్లో చిచ్చుపెట్టేందుకు దళితబంధు పేరుతో దళితులందరిని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో దళితకాలనీలు అభివృద్ధి పథంలో ఉంటున్నాయని తెలిపారు. చీకట్ల మొండయ్య, బోడకుంటశంకర్, రెడ్డి రజనికాంత్, నాగపురి రవి, తీర్థాల వీరయ్య, కుమారస్వామి, కొండ్ర లక్ష్మణ్, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొత్కపల్లి ఏఎస్‌ఐ బదిలీ

ఓదెల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శనివారం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రమేష్ ఏఎస్‌ఐని సన్మానించారు. అనంతరం ఎస్‌ఐతో పాటు ఏఎస్‌ఐలు, సిబ్బందితో కలిసి సుధాకర్‌ను సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఏఎస్‌ఐలు లక్ష్మీరాజం, కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యం కుటుంబానికి అండగా ఉంటాం



సత్యం భార్యకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను అందజేస్తున్న మనాలీఠాకూర్

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు బాలసాని సత్యం కుటుంబానికి అండగా ఉంటామని రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్ చెప్పారు. శనివారం సత్యం సంస్మరణ సభ నిర్వహించారు. మనాలీఠాకూర్, వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, ట్రస్మా నాయకులు సత్యం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం 30 ఏళ్ళుగా ఉపాధ్యాయ వృత్తిలో సత్యం అందించిన సేవలను కొనియాడారు. విద్యాభారతి హైస్కూల్, శ్రీరామవిద్యానికేతన్ పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుడిగా సత్యం ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు.

పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం

సత్యం కుటుంబాన్ని ఆదుకునేందుకు విద్యార్థులు, పూర్వవిద్యార్థులు విరాళాలు సేకరించి గురుభక్తిని చాటుకున్నారు. సేకరించిన రూ.3లక్షల 20వేల ఫిక్స్‌డ్ డిపాజిట్, ట్రస్మా తరపున రూ.41వేల ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను సత్యం భార్యకు మనాలీఠాకూర్ చేతులమీదుగా అందజేశారు. ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ అరుకాల రాంచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బందారపు యాదగిరిగౌడ్, పరుపాటి అంజారెడ్డి, కంది రవీందర్‌రెడ్డి, అదర్ సండే సమ్మారావు, చందుపట్ల తిరుపతిరెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, జీల రవి, డి హరీష్, నాగరాజు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు కడారి సునిల్, ఎరవెల్లి ముత్యం రావు, తోకల రమేష్, కె.విశ్వనాథ్, చిలుక శంకర్ పిలుపునిచ్చారు. జిల్లా కార్మిక సంఘాల సంయుక్త సమావేశం శనివారం గోదావరిఖని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారన్నారన్నారు. 44కార్మిక చట్టాలను మార్చి 4లేబర్ కోడ్లుగా తీసుకువచ్చి అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిర సిస్తూ మే 20న దేశ వ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలు, ఫెడ రేషన్లు పిలుపునిచ్చాయన్నారు. వేల్పుల కుమారస్వామి, శనిగరపు చంద్రశేఖర్, కరీం, నెర్వట్ల నర్స య్య, నరహరి రావు, రాజమొగిలి, వైకుంఠం పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

(5వ పేజీ తరువాయి)

భక్తులకు టెంట్లు వేశారు. ఎండతీవ్రతకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి సౌకర్యం కల్పించారు. కల్యాణం అనంతరం సీతారాములను దర్శించేందుకు బారీగేట్లు ఏర్పాట్లు చేశారు. సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు హాజరుకావాలని ఆలయ ఈవో, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అర్చకులు కోరారు. జీఎంకాలనీలోని సంజీవాంజనేయస్వామి ఆలయం, మార్కండేయకాలనీలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవ వేడుకలు ఈనెల 12వ తేదీతో ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

ఐదున్నర దశాబ్దాలుగా కల్యాణోత్సవాలు

గోదావరిఖనిలోని కోదండ రామాలయానికి ఐదున్నర దశాబ్ధాల చరిత్ర ఉంది. నాటి నుంచి ఎతారాముల కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. సింగరేణి సంస్థ సహకారంతో పునాది పడిన కోదండ రామాలయంలో కల్యాణోత్సవాలకు భక్తుల రద్దీ పెరగడంతో 1997లో ఆలయాన్ని ఎండోమెంట్ ఆధీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి ఎండోమెంట్ నిర్వహణలో ఆలయం కొనసాగుతున్నది.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

ముద్దసాని శంకర్, ఆలయ ఈవో

సీతారాముల కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతి ఏడాది లాగానే ఆరుబయటనే కల్యాణాన్ని వీక్షించేలా విశాలమైన మైదానంలో సౌకర్యంగా ఉండేలా, ఎండ వేడికి ఇబ్బందులు లేకుండా మంచినీటి సౌకర్యం, కూలర్లు ఏర్పాటు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలి.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ మాలదారులు శనివారం ఏర్పాట్లను పూర్తి చేశారు. చలువ పందిళ్లు, తాగు నీరు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఉదయం గ్రామస్థులు డప్పుచప్పుల్ల మధ్య ఎడ్లబండ్లపై పాలపొరకను తీసుకువచ్చి గ్రామదేవత వద్ద పూజలు చేశారు. అనంతరం పాలపొరకతో కల్యాణ వేదికలను అలంకరించారు.





పుట్నూర్‌లో డప్పు చప్పుళ్లతో పాలపొరక తీసుక వస్తున్న గ్రామస్థులు, బ్రాహ్మణపల్లిలో దేవత విగ్రహలతో హనుమాన్ భక్తులు

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు ఓడేడు, అడవి శ్రీరాంపూర్ ఖమ్మంపల్లి, కేసినపల్లి, మైదంబండ, లక్కారం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలను సిద్ధం చేశారు. శనివారం రాములవారిని ఎదురుకోల్ల కార్యక్రమాన్ని అట్టహసంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసే సాయంత్రం వేళలో ఊరేగింపు నిర్వహించనున్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెరికెగిద్ద అంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు అన్నదానం, తాగునీటి పంపిణీ వంటి సేవా కార్యక్రమాల ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ చైర్మన్ ఆకుల రామేశ్వర్ రెడ్డి విజయ లక్ష్మి దంపతులు తెలిపారు. చిన్నకలువలలో సంకట విమోచన హన్‌మాన్ దేవాలయం శ్రీరామ నవమికి ముస్తాబైంది. చలువ పందిళ్ళు అన్నదాన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు వంగపల్లి సుగుణాకర్ రావు అనసూయ దంపతులు తెలిపారు. ఐతరాజుపల్లి సీతారాముల ఆలయంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ డీకొండ భూమేష్ తెలిపారు. పలు గ్రామాలలో కూడా శ్రీరామనవమి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): ముత్తారం, హన్మంతునిపేట, బ్రాహ్మణపల్లి, కనగర్తి, భోజన్నపేట, చీకురాయి, గౌరెడ్డిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లితో పాటు పలు గ్రామాల్లో హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో పాలచెట్ల వద్దకు వెళ్లి పాలకొమ్మలను సేకరించి గ్రామంలో డప్పు చప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించి ఆలయాల్లో ప్రతిష్ఠించారు. నవమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓదెలలో : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంతోపాటు గుంపుల రామభద్రాలయం, ఓదెల సీతారామచంద్రస్వామి ఆలయంతోపాటు రామాలయాలు, హనుమాన్ దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలకు అలంకరించారు. ఆదివారం ఉదయం 11.30 నుంచి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు నిత్యావిధి కార్యక్రమాన్ని ఆలయాల్లో నిర్వహించనున్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి) వడుకాపూర్,కీచులాటపల్లి, కుమ్మరికుంట, వెంకట్రావుపల్లి, తెలుకుంట, కోనరావుపేట ఆయా గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లను చేస్తున్నారు. వడుకాపూర్ శివాలయంలో శనివారం పాలపొరుక కార్యక్రమానికి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఊరేగింపు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి హాజరయ్యారు. వేల్పుల ఓదెలు, వేల్పుల నది, వేల్పుల సతీష్, మెండె మల్లయ్య, మెండె ఓదెలు, అట్ల రమేష్, గుమ్మడి శ్రీనివాస్, అంజనేయులు, పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ





సన్న బియ్యం పంపిణి చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జయ్యారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ధర్మారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పేదలు సన్న బియ్యం తినాలనే ముఖ్యమంత్రి పథకం ప్రారంభించారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్‌లో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీలో మాట్లాడారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. మండల వ్యాప్తంగా 16,308 తెల్లరేషన్ కార్డులు ఉండగా 2,946 క్వింటాళ్ల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ఓ మహిళా మూడు నెలలుగా గ్యాస్ సబ్సిడీ జమ కావడంలేదని విప్ దృష్టికి తీసుకెళ్లగా పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ డబ్బులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగాయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు కాడే సూర్యనారాయణ, కొడారి హన్మయ్య, దేవి జనార్ధన్, కొత్త నర్సింహులు, పాలకుర్తి రాజేశం, పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): జయ్యారం, గుడిపెల్లి, పుట్నూర్, కుక్కలగూడూర్, వేమునూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సన్న బియ్యం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన బియ్యాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు ప్రజాపాలన ఫలాలను అందిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్, తహసీల్దార్ ముద్దమల్ల జ్యోతి, నాయకులు తిరుపతి,కొప్పు ప్రసాద్, ప్రశాంత్, డీలర్లు పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ అన్నారు. కార్పొరేషన్ 23వ డివిజన్‌లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు కడుపునిండా నాణ్యమైన భోజనం తినాలనే సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్ పాషా, భరత్‌గౌడ్, నాయకులు మడిపెల్లి మల్లేష్, మచ్చకుర్తి రమేష్, తూం పద్మ, సదానందం, శంకరమ్మ, మాలిక్, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీని పార్టీ శ్రేణులు ప్రారంభించారు. బుధవారంపేట్‌లోని రేషన్ షాప్‌లో మాజీ ఎంపిపి ఆరెల్లిదేవక్క, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బియ్యం పంపిణీ చేశారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో సన్న బియ్యం కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. దేశంలోనే సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వారన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మద్దెల రాజయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): ఇందుర్తిలో సన్న బియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల కోసం సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామనానరు. పడాల రాజు, ఆనంద్, రెడ్డి రజనీకాంత్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. పలు రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పథకాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్ తదితరులతో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎన్నికలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. రాజయ్య, అమిరిశెట్టి రాజలింగం, గాదాసు రవిందర్, మున్సిపల్ కమీషనర్ నియాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అణిచివేతపై పోరాడుదాం

ఎలిగేడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రమదోపిడి, సామాజిక అణచివేతపై పోరాడుతామని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి రవీందర్ పేర్కొన్నారు. శనివారం ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడలేని కుల వ్యవస్థ దేశంలో ఉందన్నారు. ఈనెల 14వరకు సామాజిక న్యాయసాధన క్యాంపెయిన్ నిర్వహించాలని సీఐటీయు రాష్ట్రకమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈనెల 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సెమినార్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయసాధన యాత్ర పేరుతో 13న బైక్‌ర్యాలీలు నిర్వహించాలన్నారు. శ్రీనివాస్, కవ్వంపల్లి దేవేందర్, కొండ్ర నర్సయ్య, ఆసంపల్లి చిరంజీవి, అంబీగాల మల్లయ్య, ఇరుగురాల స్వామి, న్యాతరి రవీందర్, కవ్వంపల్లి నర్సయ్య, కె.లక్ష్మి, రాయమల్లయ్య, శంకరమ్మ పాల్గొన్నారు.

స్ర్కాప్ టెండర్లు పూర్తి

కోల్‌సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో మూలన పడ్డ ట్రాలీలు, ట్రాక్టర్లు, జీపులను స్ర్కాప్‌గా పరిగణించి విక్రయించారు. ఆర్‌టీఓ నిర్ణయించిన కనీస రేటుపై ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించారు. పాత ట్రాలీలకు సంబంధించి రూ.2.78లక్షలు, పాత ట్రాక్టర్లు, స్కై లిఫ్టరు, జీపునకు సంబంధించి రూ.7.87లక్షలు ఆదాయం సమకూరింది. ఐదుగురు స్ర్కాప్ వ్యాపారులు ఈ టెండర్‌లో పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దళితులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఉప ప్రధానిగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, అంటరానితనం రూపుమాపడానికి కృషి చేశారన్నారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ కన్న కలలను నెరవేర్చాలన్నారు. ఆల్‌ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్ అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో ఏసీపీ మడత రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి, మాజీ కార్పొరేటర్లు రాజేష్, మహంకాళి స్వామి, వడ్డేపల్లి శంకర్, బొంకూరి మధు, కందుల సంధ్యారాణి, మంథని లింగయ్య, పెద్దెల్లి ప్రకాష్, పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధనలో బీఆర్‌ఎస్ పార్టీతో పాటు తాము ముందుం టామని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఓట్ల కోసం మాత్రమే ఎస్సీ, బీసీలను కాంగ్రెస్ పార్టీ వాడుకుంటుం దన్నారు. గత ఏడాది లాగే మహనీయుల దీక్ష తీసు కుంటామన్నారు. శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, ఎక్కేటి అనంతరెడ్డి, గొబ్బూరి వంశీ, గట్టయ్య, పాల్గొన్నారు.

మంత్రి క్యాంప్ ఆఫీసులో మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను కాంగ్రెస్ పార్టీ నేతలు పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, అయిలి ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్‌లు కొనియాడారు. గోటికార్ కిషన్‌జీ, మంథని సురేష్, అజీం, మంథని సత్యం, బూడిద శంకర్, ఎరుకల ప్రవీణ్, మంథని శ్రీను, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): కొలనూర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. మాటూరి రత్నం, అనిల్, పల్లె సుమన్, పాల్గొన్నారు.

ధర్మారం,(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. లావుడ్య రూప్లానాయక్, కాడే సూర్యనారాయణ, బొల్లి స్వామి, కాంపెల్లి చంద్రశేఖర్, రాజేశం, పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): బాబు జగ్‌జీవన్ రామ్ జయంతి పురస్కరించుకుని ఐబీ చౌరస్తాలో నివాళులర్పించారు. కల్వల శ్రీనివాస్, న్యాతరి శ్రీనివాస్, చిలక రాజేశం, న్యాతరి ప్రభాకర్,సంకెనపల్లి లక్ష్మణ్, దయాకర్, రాహుల్ శంకర్ దేవేందర్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి బీజేపీ నాయకులు జరుపుకు న్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తిగా అభివర్ణించారు. మోల్మూమూరి శ్రీనివాస్, తీగల శ్రీధర్, సంపత్, ఆసంసతీష్, ప్రభాకర్, ప్రశాంత్, రాజశేఖర్, రోహిత్, జగదీశ్ పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని ఎస్సీ కమ్యునిటి భవనంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. మానుమండ్ల శ్రీనివాస్, మానుమండ్ల సంపత్, నెరువట్ల ఆనంద్, భూమయ్య, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌చౌక్‌లో జగ్జీవ న్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దళితుల అభ్యు న్నతికి ఆయన చేసిన సేవలను నేటి సమాజం మర్చిపోవద్దన్నారు. శ్రీనివాస్, సదానందం, శంకర్, మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సు, కవ్వంపల్లి దుర్గయ్యలు పాల్గొన్నారు.

ప్రగతి ఆశ్రమంలో సరుకులు పంపిణీ

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భౌతికంగా మన నుంచి దూరమైన వారి పేరుపై చేసే సామాజిక సేవ కార్యక్రమాలే వారికిచ్చే నిజమైన నివాళులని పలువురు అన్నారు. ప్రజానాట్యమండలి బాధ్యులు, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి, ఇప్టా జాతీయ నాయకులు కె.స్వామి సతీమణి కె.అరుణ 6వ వర్ధంతి శనివారం నిర్వహించారు. జ్యోతిగాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదా వరి ఖనిలో మెప్మా నిర్వహిస్తున్న ప్రగతి నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రంలోని వారికి నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. అరుణ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కె.స్వామి కుటుంబ సభ్యులు ప్రదీప్, కోమలత, సామవేద మణి, వరుణామృత, జ్యోతిగాంధీ ఫౌండేషన్ నిర్వాహకులు దయానంద్ గాంధీ, ఏఐటీయూసీ నాయకులు మాదనమహేష్, గండి ప్రసాద్, గొడిసెల నరేష్, ప్రజానాట్యమండలి నాయకులుకన్నం లక్ష్మీనారాయణ, కళాకారులు మేజిక్‌రాజా, చంద్రపాల్, నిర్వాహకులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

జూలపల్లి, ఏప్రిల్ 5. (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ హుండీలను శనివారం గ్రామానికి చెందిన కొందరు భక్తులు లెక్కించారు. రూ.14,114 రూ.లు సమకూరినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కొప్పుల మహేష్, అమరగాని పురుషోత్తం, బానుచందర్, తాటికొండ వేను, వజ్రారెడ్డి,దేవసాని శంకరయ్య, బెజ్జెంకి రమేష్, తుమ్మ సతీష్ పలువురు పాల్గొన్నారు.



వేసవి ఉపశమన చర్యలు తీసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టులో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపశమన చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి యాదవ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం సైటాఫీస్‌లో కార్మికులను కలిసి మాట్లాడారు. రెండు రోజులుగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ నిలిపివేశారని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాంటీన్, రెస్ట్ హాల్స్, ఇతర గదులలో కూలర్లు ఏర్పాటు చేయాలని, బ్లాస్టింగ్ సెక్షన్ కార్మికులతో పాటు ఎక్కువ సమయంలో ఎండలో పనిచేసే కార్మికులకు గొడుగులను అందజేయాలని, క్వారీలో అవసరమైన చోట చలువ పందిళ్ల వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రవికుమార్, సంజీవ్, సతీష్‌కుమాం రాజు, ఆనంద్, శంకర్, రాజన్న, సమ్మయ్య కొంరయ్య పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో పాలీసెట్ శిక్షణ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా పాలీసెట్ శిక్షణ ఇవ్వనున్నట్టు సొసైటీ సెక్రెటరీ గుండా శ్రీనివాస్, ఆర్జీ-2 అధికార ప్రతినిధి అనిల్‌కుమార్‌లు ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని సింగరేణి పాఠశాలలతోపాటు సెక్టార్-3 పాఠశాలలో ఈనెల 10వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. పాలిటెక్నిక్ ద్వారా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, బీటెక్‌లో చేరవచ్చునని వారు తెలిపారు. కాలనీ, పరిసర ప్రాంతాలకు చెందిన పదో తరగతి పూర్తయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గుండా శ్రీనివాస్, అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో డైరెక్టర్(పీపీ, పా) సమీక్ష

గోదావరిఖని, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో సింగరేణి డైరెక్టర్(పీపీ, పా)కే వెంకటేశ్వర్లు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్లు, ప్రాజెక్టు మేనేజర్లు, ఇంజనీర్లు, అన్ని విభాగాల ఉన్నతాధికారులతో ఆర్‌జీ-1 ఏరియాకు సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, సంక్షేమం గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించిన నిర్దేశిత లక్ష్యాల గురించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పదకత, ఓబీ రిమూవింగ్, బొగ్గును రవాణ తదితర విషయాల గురించి సమీక్షించారు. ఈ సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో భాగంగా వేగవంతంగా బొగ్గు రవాణా చేయాలని, బొగ్గు రవాణాలో ఆలస్యం జరగకుండా వెను వెంటనే రవాణ అయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్ని విభాగాల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బొగ్గు ఉత్పత్తి తో పాటు తప్పని సరిగా రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తి చేయాలని సూచించారు. గత సంవత్సరం ఆర్‌జీ-1 ఏరియా వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినందుకు ఆర్‌జీ-1 ఏరియా టీంను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కుడా నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం గోపాల్ సింగ్, అధికారులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్‌రావు, అంజనేయులు, శివ నారాయణ, ఏజెంట్లు చిలుక శ్రీనివాస్, రమేష్, అంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, కర్ణ, కుమారస్వామి, వరప్రసాద్, రాజేష్, లక్ష్మీరాజం, వీరారెడ్డి, బీమా, హనుమంతరావు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో సర్వే చైన్‌మన్ పరీక్షలు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎంవీటీసీ శిక్షణా శిబిరంలో శనివారం సర్వే విభాగం అసిస్టెంట్ చైన్‌మన్, హెడ్ చైన్‌మన్ పోస్టుల భర్తీకి అధికారులు పరీక్షలు నిర్వహిం చారు. ఐదు అసిస్టెంట్ చైన్‌మన్, రెండు హెడ్ చైన్‌మన్ పోస్టుల కోసం నిర్వహించిన ఈ పరీక్షలకు అర్హులైన ఆరుగురు ఉద్యోగులు హాజరయ్యారు. ఆయా విభాగాల్లో అభ్యర్థుల ప్రతిభను పరీక్షించారు. అఫీషియేటింగ్ జీఎం రాముడు, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, ఏరియా సర్వే అధికారి బూక్యదేశాయి, వీటీసీ మేనేజర్ మురళీకృష్ణల ఆధ్వర్యంలో ఈపరీక్షలు జరిగాయి.

ఓసీపీ-5ని తనిఖీ చేసిన డైరెక్టర్(పీపీ, పా)



వ్యూపాయింట్ ద్వారా ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

గోదావరిఖని, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(పీపీ, పా)కే వెంకటేశ్వర్లు శనివారం ఆర్‌జీ-1 ఏరియా జీడీకే ఓసీపీ-5ని తనిఖీ చేశారు. వ్యూ పాయింట్ సందర్శించి గని స్థితిగతులను అధికారులను తెలుసుకున్నారు. ఉత్పత్తి లక్ష్యం సాధించుకునే దిశగా భవిష్యత్తు ప్రణాళికలు తీర్చిదిద్దడానికి సూచనలు చేశారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, పీఓ చంద్రశేఖర్, ప్రాజెక్టు మేనేజర్ డీ రమేష్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్, అఫీషియటింగ్ మేనేజర్ పీ శ్రీనివాస్, సర్వేయర్ దీటి చంద్రమౌళి పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో రక్తపింజర

గోదావరిఖని, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి జీఎం కార్యాలయంలోకి శనివారం రక్తపింజర చొరబడింది. సెక్యూరిటీ కార్యాలయం వైపు నుంచి లోనికి రావడంతో సెక్యూరిటీ సిబ్బంది, డైవర్లు గమనించారు. ఉద్యోగులు, అధికారులు ఆందోళనకు గురయ్యారు. కొన్ని రోజులుగా సమీపంలోని ప్లాంటేషన్ నుంచి విష సర్పాలు కార్యాలయంలోకి వస్తున్నట్టు సిబ్బంది పేర్కొంటున్నారు.